సాక్షి
వికారాబాద్

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



చిన్న పనికి.. పెద్ద మొత్తం!

అవినీతి అధికారులు ఏసీబీ వలకు చిక్కడంతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. 10లో▸



ఉద్యోగ భద్రతకు డిమాండ్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 10లో▸



నిఘా నేత్రం..

సాంకేతికత రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో అదేస్థాయిలో మోసగాళ్ల సంఖ్య పెరుగుతోంది. 11లో▸

న్యూస్‌రీల్

క్రిస్మస్ శుభాకాంక్షలు



అనంతగిరి: ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా క్రిస్టియన్లకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన క్రీస్తు బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయమన్నారు. పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

నేడు, రేపు పత్తి కొనుగోళ్లు బంద్

అనంతగిరి: క్రిస్మస్ పండుగ నేపథ్యంలో బుధవారం ప్రభుత్వ సెలవు ఉన్నందున కాటన్ మిల్లుల్లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రక్రియ నిలిపివేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కాటన్ మిల్లుల వద్ద నిల్వలు ఎక్కువగా ఉన్నందున గురువారం కూడా కొనుగోలు ప్రక్రియ నిలిపివేయడమైందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన సూచించారు.



అనంతగిరి: క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన వికారాబాద్‌లోని మెథడిస్టు చర్చి

క్రిస్మస్ శోభ

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. శిలువ, పశువుల పాక, మేరీ మాత, క్రిస్మస్ తాత బొమ్మలను, క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. బుధవారం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు, దైవ సందేశం వినిపించనున్నారు. చర్చిలకు వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



తాండూరు టౌన్‌: పట్టణంలోని రాజీవ్‌కాలనీ చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాక

మంత్రి తుమ్మల తోటకు రైతులు

ధారూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సాగుచేసిన పామాయిల్ తోటను మంగళవారం ధారూరు మండల రైతులు సందర్శించారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఏడీఏ వినోద్‌కుమార్, రైతు సంఘం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, ఏఓ సూర్యప్రకాశ్, ఏఈఓ సంతోష్ బృందం అక్కడకు వెళ్లి పరిశీలించారు. వ్యవసాయ అధికారులు రైతులకు పామాయిల్ సాగు విధానాన్ని వివరించారు. పామాయిల్ సాగుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. ఒక మొక్క ఖరీదు రూ.340 కాగా సబ్సిడీపై రూ.20 చెల్లించి పొందవచ్చని వారు సూచించారు.



హక్కులపై అవగాహన కల్పించండి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: డిజిటల్ విధానం, వర్చువల్ విచారణ పద్ధతిన వినియోగదారులకు న్యాయం చేకూర్చేలా అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ..ప్రతి పౌరునికి వినియోగదారుల హక్కు ల గురించి తెలియజేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.వినియోగదారులసమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. వినియోగదా రుల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా, వారికి న్యాయం చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఎస్సీడబ్ల్యూడీఓ మల్లే శం,తూనికలు కొలతలు శాఖ జిల్లా అధికారి రియా జ్, చౌక ధరల దుకాణాల సంఘం జిల్లా అధ్యక్షుడు జూకారెడ్డి, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

నేడు బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌కు నరేందర్‌రెడ్డి



కొడంగల్: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం ఉదయం 11 గంటలకు బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు రానున్నారు. లగచర్ల ఘటనలో నిందితునిగా ఉన్న ఆయనకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన బొంరాస్‌పేటకు వస్తున్నారు. అక్కడి నుంచి కొడంగల్‌కు వచ్చి కార్యకర్తలను కలుస్తారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతగిరి: ఈ నెల 28, 29, 30 తేదీల్లో జరిగే టీఎస్ యూటీఎఫ్ 6వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం పిలుపునిచ్చారు. మంగళవారం వికారాబాద్‌లోని జెడ్పీ కార్యాలయం ఆవరణలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ పట్టణంలో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



జిల్లాస్థాయి పరుగు పందెం పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు

కుల్కచర్ల: సీఎం కప్ క్రీడల్లో భాగంగా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం వికారాబాద్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో 3వేల మీటర్ల రన్నింగ్ విభాగంలో మనీషా ప్రథమ స్థానం, నందిని ద్వితీయ స్థానంలో నిలిచారు. 800ల మీటర్ల రన్నింగ్ బాలికల విభాగంలో అంకిత మొదటి స్థానం, గాయత్రి ద్వితీయస్థానంలో నిలిచారు. మనీషా, అంకిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 31న హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మహ్మద్ సోహెల్



బంట్వారం: వికారాబాద్‌లో జరిగిన సీఎం కప్ టోర్నమెంట్‌లో జిల్లాస్థాయి పోటీల్లో బంట్వారం మోడల్ స్కూల్ విద్యార్థి మహ్మ ద్ సోహెల్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 200 మీటర్ల బాలుర విభాగం పరుగు పందెంలో సత్తా చాటాడు. మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



వికారాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

అనంతగిరి: పార్లమెంట్ సమావేశాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్.టి.రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మహోన్నత వ్యక్తి పట్ల చులకనగా మాట్లాడటం బాధాకరమన్నారు. అమిత్‌షా భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు షరీఫ్, వెంకట్‌రెడ్డి, వేణు, నర్సింగ్‌నాయక్, సతీష్‌రెడ్డి, మల్లేశం, రహీం తదితరులు పాల్గొన్నారు.

చిన్న పనికి.. పెద్ద మొత్తం!

సమస్యల పరిష్కారానికి డబ్బులు డిమాండ్

- తరచూ ఏసీబీకి చిక్కుతున్న లంచావతారులు
- సీఎం నియోజకవర్గం రైతుల నుంచి రూ.5 లక్షలు వసూలు
- తాజాగా తాండూరులో పట్టుబడిన ఇద్దరు అధికారులు
- గతంలోనూ ఆరోపణలు



దానయ్య, మాణిక్‌రావును అరెస్టు చేసి తీసుకెళ్తున్న ఏసీబీ అధికారులు

వికారాబాద్: అవినీతి అధికారులు ఏసీబీ వలకు చిక్కడంతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. చిన్న పనికి పెద్ద మొత్తంలో లంచం తీసుకుంటూ తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఇద్దరు అధికారులు సోమవారం ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. ధరణి టీఎం 33లో భాగంగా ఆరు ఎకరాల ల్యాండ్ నేచర్ మార్పు కోసం రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావ్, ఏఓగా పని చేస్తున్న తహసీల్దార్ దానయ్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. గతంలో కూడా అనేక సార్లు అధికారులు, ఉద్యోగులు ఏసీబీ అధికారులకు చిక్కినా ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంటూ పట్టుబడటం ఇదే మొదటి సారి. సీఎం సొంత నియోజకవర్గం దుద్యాల్ మండలానికి చెందిన ఘటన కావడం చర్చనీయాంశమైంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమావేశమై చర్చించినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని యంత్రాంగాన్ని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే జిల్లాలో పలు శాఖలు, కార్యాలయాలు, అధికారులపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.

దానయ్యపై పలు ఆరోపణలు

- సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావ్ గతంలో కలెక్టర్ సీసీగా పని చేసిన సమయంలోనూ పలు ఆరోపణలు వచ్చాయి.
- తహసీల్దార్ దానయ్య వ్యవహారం ఆద్యంతం వివాదాస్పదమే. పరిగి తహసీల్దార్‌గా పని చేసిన సమయంలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు, వివిధ సంఘాల నేతలు ఆందోళనకు దిగారు.
- స్పందించిన ఉన్నతాధికారులు ఆయనపై బదిలీ వేటు వేసి దుద్యాల్ మండల తహసీల్దార్‌గా నియమించారు.
- అక్కడ కూడా చేతివాటం ప్రదర్శించారు. ప్రస్తుతం లంచం తీసుకుంటూ పట్టుబడిన సంఘటన కూడా దుద్యాల్ భూ వ్యవహారంలోనే కావడం గమనార్హం.
- ఓ ఐఏఎస్ అధికారి విధులు నిర్వహించే కార్యాలయంలోనే ఇంత పెద్ద మొత్తంలో లంచం తీసుకోవడం ఆయన అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఈ వ్యవహారంలో ఆ ఇద్దరి అధికారులకే సంబంధం ఉందా..? ఉన్నతాధికారుల ప్రమేయం ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాత్రంతా సోదాలు, విచారణ..

తాండూరు: లంచం తీసుకుంటూ చిక్కిన ఇద్దరు రెవెన్యూ అధికారులను ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దుద్యాల మండలంలో ఉన్న 6.26 ఎకరాల ఎల్‌ఎఫ్ భూమిని పట్టా భూమిగా మార్చేందుకు తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డీపీఓ దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావు రూ.5 లక్షలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం కొడంగల్ ప్రాంతంలో డబ్బులు తీసుకుంటుండగా దానయ్య, మాణిక్‌రావును పట్టుకున్న అధికారులు రాత్రి 8 గంటలకు వారిని తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఆఫీసు గేట్‌కు తాళాలు వేసి, అన్ని విభాగాల్లో సోదాలు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు భోజనాలు చేసిన అనంతరం తిరిగి విచారణ చేపట్టారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇద్దరు అధికారుల ఇళ్లలో సైతం అదే రాత్రి సోదాలు చేశారు. విలువైన పత్రాలను సేకరించి, 12 గంటల పాటు విచారణ చేశారు. అనంతరం ఇద్దరినీ అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

అధికారుల్లో అలజడి..

తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు పెద్ద ఎత్తున లంచం తీసుకుంటూ పట్టుబడటంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో అలజడి మొదలైంది. మంగళవారం సబ్ కలెక్టర్‌తో పాటు సిబ్బంది ఎవరూ విధులకు హాజరు కాలేదు. దీంతో సీట్లన్నీ ఖాళీగా కనిపించాయి. రికార్డ్ అసిస్టెంట్ బుగ్గప్ప, ఇద్దరు అటెండర్లు మాత్రమే ఆఫీసులో కనిపించారు. మరి కొందరిని కలెక్టరేట్‌కు పిలిపించుకోవడం చర్చనీయాంశమైంది. డివిజన్ పరిధిలోని 7 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులు ఏసీబీ షాక్ నుంచి తేరుకోలేదు.

తరచూ ఏసీబీ వలలో..

కొంత మంది అధికారుల ధన దాహానికి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లంచావతారుల బాధలు తట్టుకోలేక తరచూ ఎవరో ఒకరు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయిస్తూనే ఉన్నారు. గతంలో తాండూరులో ఓ సబ్ రిజిస్ట్రార్, పరిగిలో ఎంపీడీఓ, ఈజీఎస్ ఉద్యోగులు, రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్, వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో పని చేసే ఓ పోలీసు అధికారి, వికారాబాద్‌లో ఓ ఇంజనీర్ లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. తాజాగా పట్టుబడిన వారు రెవెన్యూ శాఖకు చెందిన వారు కాగా మిగతా డిపార్ట్‌మెంట్లలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, మైనింగ్, సబ్ రిజిస్ట్రార్, ఎస్టీఓ, డీటీఓ, ఆర్టీఏ, పోలీస్, షల్ వెల్ఫేర్ శాఖల్లో పర్సెంటేజీలు వసూలు చేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ప్రభుత్వ శాఖల్లో పర్సెంటేజీలు నిత్యకృత్యమయ్యాయి.

క్లుప్తంగా

'నూతన' వేడుకలకు అనుమతులు తప్పనిసరి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: నూతన సంవత్సర వేడుకలు నిర్వహించేందుకు ఈవెంట్స్, రిసార్ట్స్, ఫాం హౌజ్ వారు పోలీసుల అనుమతులు తప్పక తీసుకోవాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. అనుమతులు లేకుండా ఈవెంట్‌లు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడుతామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు చేసుకోవాలని సూచించారు.

'లగచర్ల' రైతులపై కేసులు ఎత్తివేయాలి

- ఈ నెల 30న బహిరంగ సభ
- సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్



కరపత్రం విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతగిరి: ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూములు సేకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలనే డిమాండ్‌తో పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 30న హకీంపేట్ గేట్ వద్ద బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు పలువురు అగ్రనేతలు వస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, నవీన్, శ్రీను, ప్రశాంత్, నరేందర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంబీబీఎస్ విద్యార్థిని మృతి



మేఘన (ఫైల్)

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని మహవీర్ మెడికల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందింది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన మేఘన(18) స్థానిక మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతోంది. కాగా సోమవారం సాయంత్రం కళాశాల ఆవరణలోని గ్రౌండ్‌లో స్నేహితులతో కలిసి ఉండగా.. గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను కళాశాల ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. తల్లిదండ్రులు చేరుకుని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతిచెందింది. విద్యార్థిని తండ్రి బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ద్విచక్రవాహనదారుడు దుర్మరణం

యాచారం: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తక్కళ్లపల్లి తండా వద్ద చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తక్కళ్లపల్లి తండాకు చెందిన అంగోత్ హరి(45) మంగళవారం బైక్ పై యాచారం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మాల్ నుంచి హైదరాబాద్ మార్గంలో ప్రయాణిస్తున్న ఓ కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో హరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య హరిత, ఇద్దరు కుమారులు సంతానం. కాగా కారు డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని హరి సంబంధీకులు ఆందోళన చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని.. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

క్రిస్టియన్ల అభ్యున్నతికి కృషి



కొడంగల్: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

కొడంగల్: క్రిస్టియన్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి విందు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని క్రిస్టియన్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేశారన్నారు. కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, ప్రత్యేకాధికారి హన్మంత్‌రావు, తహసీల్దార్లు విజయ్‌కుమార్, మహేశ్, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు నందారం ప్రశాంత్, కృష్ణంరాజు, నర్సింలు గౌడ్, బాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శంకర్ నాయక్, ఆసిఫ్‌ఖాన్, ఆనంద్‌రెడ్డి, రాంరెడ్డి, ఎస్ ఎమ్ గౌసన్ తదితరులు పాల్గొన్నారు.

జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కుల్కచర్ల: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న జేకేఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్టియన్లకు కేక్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేకేఎంఆర్ కోఆర్డినేటర్ రాంచంద్రయ్య మాట్లాడుతూ.. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతి కృషి చేస్తున్నారని చెప్పారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ల అరెస్ట్

పది తులాల బంగారు ఆభరణాలు చోరీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ



రికవరి చేసిన బంగారం, పెప్పర్ స్ప్రే, కొడవలి

అనంతగిరి: ఒంటరి మహిళలే టార్గెట్‌గా చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న దొంగలను వికారాబాద్ సీసీఎస్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్పీ నారాయణరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 20న బొంరాస్‌పేట పీఎస్ పరిధిలో ఓ మహిళ మెడలోంచి రెండున్నర తులాల బంగారు గొలుసు, అదే నెల 22న వికారాబాద్ పట్టణంలోని కిరణా షాపులో రెండున్నర తులాల బంగారు గొలుసు, అదే రోజు కులకచర్లలోనూ స్నాచింగ్‌కు యత్నించారు. రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా మూడు స్నాచింగ్ కేసులు నమోదవ్వడంతో సీసీఎస్ సీఐలు బల్వంతయ్య, అన్వర్‌పాషా ఆధ్వరంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాలు, టెక్నికల్ ఆధారాలతో అంతర్రాష్ట్ర నేరస్తులు ఎండీ జావిద్, ఓ మైనర్‌ను కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా హమ్నాబాద్ తాలూకాలో తేజస్ లాడ్జి వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా జిల్లాలోని మూడు స్నాచింగ్‌లతో పాటుగా సంగారెడ్డి జిల్లా సదాశివపేట, జహీరాబాద్ ఠాణా పరిధిలోనూ మెడలోంచి గొలుసులు చోరీ చేసినట్లు ఒప్పుకొన్నారు. నిందితులను అరెస్ట్ చేసిన వికారాబాద్ సీసీఎస్ పోలీసులు రూ.7.80లక్షల విలువైన పది తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు.

కోవిడ్ చికిత్స పొందుతూ..

జావీద్‌పై బీదర్ జిల్లా సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి వద్ద ఎన్‌బీడబ్ల్యు(నాన్ బెయిలబుల్ వారెంట్) పెండింగ్‌లో ఉంది. 2020లో చర్లపల్లి జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా కోవిడ్ సోకింది. దీంతో గాంధీ ఆస్పత్రిలో జాయిన్ చేయగా అక్కడ నుంచి పారిపోయాడు. అప్పట్లో చిలకలగూడ ఠాణాలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. 2022 నవంబర్‌లో బీదర్ జిల్లా సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి (బస్వకళ్యాణ్) కోర్టు నుంచి బెయిల్ మీద వచ్చి మళ్లీ కోర్టుకు వెళ్లకపోవడంతో ఎన్‌బీడబ్లు కేసు పెండింగ్‌లో ఉందన్నారు. ఇట్టి కేసును ఛేదించిన సీసీఎస్ సీఐలు బల్వంతయ్య, అన్వర్‌పాషా, హెడ్ కానిస్టేబుళ్లు చెన్నయ్యగౌడ్, జయవర్ధన్, శివకుమార్, పీసీలు కృష్ణారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అంజప్ప, రామకృష్ణలను అభినందించి రివార్డ్స్ అందజేస్తామన్నారు.

ఆదివారం చోరీలకు దూరం

మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల మధ్య నేరస్తుడైన ఎండీ జావిద్ మరో బాలుడు కలిసి స్నాచింగ్‌కు వెళ్తారు. ఆదివారం చోరీలకు దూరంగా ఉంటారు. స్నాచింగ్‌కు ముందు గంజాయి సేవించి.. పెప్పర్ స్ప్రే, వేట కొడవలిని వెంటబెట్టుకుని బయలుదేరుతారు. వాకింగ్ చేసే మహిళలు, ఆరుబయట కూర్చున్న వారు, కిరాణా దుకాణం నడిపించే మహిళలను టార్గెట్ చేసుకుంటారు. వీరిలో ఒకరు బైక్ నడుపుతుండగా.. మరొకరు స్నాచింగ్ చేసి పరారైతారు. ఈ క్రమంలో ఎవరైనా అడ్డుపడితే పెప్పర్ స్ప్రే చేయడం, వేటకొడవలిని చూపుతూ బెదిరించి అక్కడ నుంచి తప్పించుకుంటారు. ఏ-1 నేరస్తుడు జావిద్ ఆరిఫ్, మేరాజ్, అర్షద్, రశీద్, ఆఫ్రోజ్, వజీద్, సమీర్, రఫూఫ్, అర్బసలలో ఒకరిని తోడుగా తీసుకువస్తుంటాడు. నిందితుడిపై కర్ణాటకతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, అదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 150 కేసులు నమోదయ్యాయి. ఇన్ని నేరాలకు పాల్పడిన నిందితులు కేవలం రెండు సార్లు మాత్రమే పోలీసులకు చిక్కారు. చోరీలకు పాల్పడిన నేరస్తుడు వెంటనే బైక్‌ను, నంబర్‌ప్లేట్, ధరించిన దుస్తులు మార్చడం చేస్తారు. ఎప్పటికప్పుడు ఫోన్‌లు, సిమ్‌లు మార్చుతూ టెక్నికల్‌గా దొరక్కుండా జాగ్రత్త పడుతుంటారు. నేరం చేసే స్థలం నుంచి వంద కిలోమీటర్ల ముందు, తర్వాత వంద కిలో మీటర్ల వరకు ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తారు.

బడుగులకు దేవుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ముదిరాజ్

తాండూరు టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఎస్పీ నాయకులు మంగళవారం స్థానిక శివాజీ చౌక్‌లోని శివాజీ విగ్రహానికి పూలమాల వేసి బస్టాండు వరకు నోటికి నల్ల వస్త్రం ధరించి మౌన ప్రదర్శన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతోనే నాయకులు అసెంబ్లీ, పార్లమెంటుకు వెళ్లి ఉన్నత హోదాల్లో ఉన్నారన్నారు. రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్యబద్ధంగా పాలన కొనసాగుతోందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ దేవుడని, ఆయన్ని ఆరాధిస్తామన్నారు. బాబాసాహెబ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, అమ్జద్ అలీ, బాలరాజు, సాయి, కృష్ణ, ప్రవీణ్, పాండు, శాంతు, క్రాంతి, యాసర్, హన్మంతు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కొడంగల్ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడడం సరికాదని వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు ఇసువప్ప, అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యూ.రమేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి గౌరగళ్ల కృష్ణ, డీవీఎంసీ జిల్లా మెంబర్ దస్తప్ప, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా అధ్యక్షుడు లింగం సాయిలు, నాయకులు ఎ.సాయిలు, చిన్నయ్య, రేణుక, కృష్ణ, పవన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసిన ఫార్మాసిటీ భూబాధితులు

యాచారం: రాష్ట్ర హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టీజీఐఐసీ వద్ద ఉన్న భూములను రైతుల పేరు మీద చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తమ అంగీకారం లేకుండానే పట్టా భూములను ఫార్మాసిటీకి తీసుకుందని, భూ రికార్డులను టీజీఐఐసీ పేరు మీద మార్చేసిందని తెలిపారు. గతంలో పలుమార్లు కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచారం తహసీల్దార్లను కలిసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి టీజీఐఐసీ పేరు మీద భూ రికార్డులను మళ్లీ రైతుల పేర్ల మీద మార్చాలని కోరారు. అనంతరం రైతులకు పంట రుణాలు, రైతుబంధు ఇతర ప్రయోజనాలు కల్పించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కవుల సరస్వతి, కానమోని గణేష్, నిరంజన్, మహిపాల్‌రెడ్డి, దేవోజీ, అనుసూయమ్మ, భగవంత్‌రెడ్డి, వెంకటేశ్, వినోద్‌రెడ్డి, అచ్చిరెడ్డి, రాజు, లింగం, నాగరాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

నల్లగొండ జిల్లా కేంద్రంలో 43వ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. మంగళవారం పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా మహిళా జట్టు క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేశారు.

నకిలీ పత్రాలతో ప్లాట్ల విక్రయం

ముఠాలోని ముగ్గురికి రిమాండ్

హయత్‌నగర్: నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్లు విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీన్‌పార్క్ కాలనీకి చెందిన ముడావత్ దీప్లానాయక్, నందనవనం కాలనీకి చెందిన కేతావత్ పూల్‌సింగ్, అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన మాచగోని రంగయ్య, బిరాదర్ మారతి, స్వామినాయక్, రమేష్‌నాయక్‌తో పాటు మరికొందరు ముఠాగా ఏర్పడ్డారు. చాలా కాలం ఖాళీగా ఉన్న, అభివృద్ధి చేయని ఇతరుల ప్లాట్లను గుర్తించి.. వాటికి సీసీ కాపీలు సంపాదించారు. వీటికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి అమాయకులకు అంటగడుతున్నారు. వీరి వద్ద ప్లాటు కొనుగోలు చేసిన వాణిశ్యాంప్రసాద్ దంపతులు వీరి మోసాలను గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విచారణలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధి గండిచెర్వులోని సర్వే నంబర్ 183, 186–189లోని పలు ప్లాట్లను.. పెద్ద సంస్థలకు సైతం విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు దీప్లానాయక్, పూల్‌సింగ్, రంగయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, మిగిలిన వారికోసం గాలిస్తున్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- చోరీలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్
- 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ

షాద్‌నగర్ రూరల్: పగటిపూట రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లకు కన్నం వేస్తున్న నిందితుడిని షాద్‌నగర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్ఐ శరత్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని విజయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 23న ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చే వరకు తాళం పగులకొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలోని 18.1 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉండే మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లితండాకు చెందిన శివప్రసాద్(25)గా గుర్తించారు. పక్కా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకొన్నాడు. నిందితుడి వద్ద నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. కేసు ఛేదించిన సిబ్బందిని అభినందించి రివార్డులు ప్రకటించారు.

ఉద్యోగ భద్రతకు డిమాండ్

- సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



ఎంపీడీఓకు సమ్మెనోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వంజీపీ కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 27, 28 తేదీల్లో ఎంపీడీఓ కార్యాలయం ఎదట ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే జనవరి 4 తర్వాత నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు, అంజిలప్ప, లక్ష్మి, ప్రేమ్ తదితరులు ఉన్నారు.



మామిళ్ల ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మహిళల ప్రదక్షిణలు

మామిళ్ల ఎల్లమ్మ తల్లికి బోనం

మూడవ రోజుకు చేరిన శ్రీతుల్జా భవానీ మాత జాతర ఉత్సవాలు

మండల పరిధిలోని నాగారం గ్రామంలో ఈ నెల 22న ప్రారంభమైన శ్రీతుల్జా భవానీ మాత జాతర ఉత్సవాలు మంగళవారం మూడవ రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా మామిళ్ల ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మహిళలు స్నానమాచరించి బోనాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో నిర్వాహకులు నరోత్తంరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు. – ధారూరు